JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । మంగళవారం 23-06-2026

Medchal - Malkajgiri । Tuesday 23-06-2026

Follow: jayabherinews

సంపుటి : 03 । సంచిక : 22

పేజీలు : 8 । వెల : 5

Vol. 03 । Issue 22 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me



jayabheripaper@gmail.com

## అమెరికాతో ట్రేడ్ డీల్ వద్దు
# మా పొట్ట కొట్టొద్దు

- అమెరికాలోని ప్రతినిధులు భారత్ లోని వ్యవసాయ మార్కెట్ పై ఆసక్తి
- ఆ ప్రొడక్ట్స్ తో భారత్ లోని చిన్న, సన్నకారు రైతులు పోటీపడటం అసాధ్యం
- దిగుమతులు పెరిగితే వీరి జీవనోపాధి, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని రైతులు ఆవేదన




**జయభేరి, న్యూఢిల్లీ:**

భారత్ అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చల నేపథ్యంలో హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్ లోని యాపిల్ పంటను సాగు చేసే రైతులు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ మేరకు వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గించే ఏ నిర్ణయంపైనా అంగీకారం తెలపొద్దని.. దానివల్ల రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని లేఖలో స్పష్టం చేశారు. జూన్ 23 మంగళవారం నుంచి అమెరికాతో మినిస్టీరియల్ లెవెల్ లో చర్చలు ప్రారంభం కానున్నట్లు సమాచారం అందుతున్న నేపథ్యంలో యాపిల్, ఆల్ మండ్స్, వాల్ నట్స్, ఇతర దేశీయ హార్టికల్చర్ పంటలను పండించే రైతులు ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. హిల్ స్టేట్ హార్టికల్చర్ ఫోరమ్ ఈ మేరకు భారత్ అమెరికా ఒప్పందంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ డీల్ కారణంగా రైతుల ప్రయోజనాలు, హార్టికల్చర్ దెబ్బతింటుందని అభిప్రాయపడుతున్నాయి. " గత కొన్ని నెలలుగా అమెరికాలోని ప్రతినిధులు భారత్ లోని వ్యవసాయ మార్కెట్ పై ఆసక్తి చూపిస్తున్నారు. తమ ఉత్పత్తులను భారత వ్యవసాయ మార్కెట్లోకి ప్రవేశపెట్టి తద్వారా లాభాలను ఆర్జించాలని అగ్రరాజ్యం చూస్తోంది.

...మిగతాది 2 లో




# ఢిల్లీలో రేవంత్ బిజీ బిజీ

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ

**జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 22 :**

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరుసగా కేంద్ర మంత్రులతో భేటీ అవుతున్నారు. సోమవారం ఉయదం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగిన ఈ కీలక సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు రక్షణ రంగ భూములు, ప్రాజెక్టుల అంశాలపై ఇద్దరు నేతలు చర్చించారు. లంగర్ హౌస్ బాపూ ఘాట్ వద్ద చేపడుతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన రక్షణ శాఖ భూములను బదలాయించినందుకుగాను కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం అయినందువల్ల ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ విమానాశ్రయం ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విమానాశ్రయంలో ఎయిర్ ఫోర్స్ టెర్మినల్‌తో పాటు కార్గో, ఎమ్ఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలను కల్పించాలని రక్షణ మంత్రిని ఆయన కోరారు. హ్యాంగర్స్ ఏర్పాటుకు ఆదిలాబాద్ విమానాశ్రయం ఎంతో అనుకూలంగా ఉంటుందని రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. వీటితో పాటు మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో ప్రతిపాదిత డీఆర్‌డీవో ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాజకీయాల్లో నేటి సాయంత్రం ఆసక్తికర పరిణామం చోటుచేసుకోబోతోంది. నిత్యం విమర్శలు గుప్పించుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సోమవారం ఢిల్లీలో ఒకే సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సీఎం రేవంత్, కిషన్ రెడ్డి భేటీఅయ్యారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఇదివరకే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాయగా, ఆయన సానుకూలంగా స్పందించి భేటీని ఖరారు చేశారు.

# రైతు భరోసా

- అన్నదాతలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీపి కబురు
- ఈ విడతలో మొత్తం 73 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 9,000 కోట్లను జమ చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళిక
- ఈ వానాకాలం సీజన్ నుంచి 7.20 గుంటల వరకు భూమి ఉన్న వారికే భరోసా సాయం పరిమితం చేయాలని ప్రభుత్వం ఆలోచన




# మహిళా సాధికారతకు పెద్దపీట

- ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం

**జయభేరి, ఖమ్మం జిల్లా :**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యాను. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయి. ఈ పథకాలను మహిళా కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు మరింత చేరువ చేయాలి. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదలకు రూ.5 లక్షల ఆర్థిక సాయంతో సొంతింటి కలను నెరవేర్చుతున్నాం.




# తెలంగాణలో వర్షాల దండయాత్ర

- కానీ అసలు ప్రమాదం ఇంకేదో అంటున్న నిపుణులు
- తెలంగాణకు భారీ వర్ష సూచన.. ఆ జిల్లాల్లో ఉరుములతో కూడిన వానలు, ఆరెంజ్ అలర్ట్



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రవేశం కొంత ఆలస్యంగా సాగిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ఈ నెల 8వ తేదీన ప్రవేశించినప్పటికీ, ఉత్తర తెలంగాణ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో విస్తరించడానికి దాదాపు రెండు వారాల సమయం పట్టింది. సాధారణంగా ఈ సమయానికి తెలంగాణతో పాటు మహారాష్ట్రలోనూ రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరించి, విస్తృతంగా వర్షాలు కురవాలి. అయితే ఈసారి వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వ్యవస్థలను ప్రభావితం చేసే ఎల్‌నీనో ప్రభావం ప్రారంభమైనట్లు సంకేతాలు కనిపిస్తున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఎల్‌నీనో ప్రభావం కారణంగా సాధారణ వర్షపాతం నమూనాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. దీని ప్రభావంతో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో కొంత భిన్నమైన వాతావరణ

...మిగతాది 2 లో



# ప్రభుత్వంపై కుట్రలు
## పాత కేసులపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

- మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం.. అధికారులకు దిశానిర్దేశం
- పాత కేసుల ట్రేసింగ్.. తప్పు చేసిన వాడు తప్పించుకోలేడు
- డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్ లాంచ్.. పర్యావరణానికి పెద్దపీట

**జయభేరి, అమరావతి :**

రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు కుట్రలు పన్నుతూ, ప్రతి చిన్న అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వివిధ సంఘటనలకు కులం, మతం అనే రంగులు పులుముతూ వివాదాస్పదంగా మారుస్తున్నారని, ఫేక్ ప్రచారాలతో ఉద్యోగులను, అధికారులను బద్నాం చేస్తూ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి విద్వేషాలు పెంచే ఘటనలు, తప్పుడు ప్రచారాలను కంట్రోల్ చేసేలా ఉద్యోగులు, అధికారులు మరింత అప్రమత్తతతో వ్యవహరించాలని ఆయన ఆదేశించారు.

రాష్ట్రంలో పీజీఆర్ఎస్ సహా ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని అధికారులు మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కరించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే పౌరులతో అధికారులు ఎంతో సౌమ్యంగా, మర్యాదగా వ్యవహరించాలని, ప్రతి ఒక్కరూ సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఫిర్యాదుదారుల స్థానంలో ఉండి సమస్యను చూస్తేనే దానికి సరైన పరిష్కారం లభిస్తుందని, దీని ద్వారా పాలనపై ప్రజల్లో మంచి భావన కలుగుతుందని సీఎం పేర్కొన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా మంత్రులు, అధికారులు, ఉద్యోగులు తమ పని విధానాన్ని మార్చుకోవాలని, క్షేత్రస్థాయి పర్యటనలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తేనే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతామని చెప్పారు.


...మిగతాది 2 లో

# డ్రగ్స్ యువత భవిష్యత్తుకు ముప్పు

- డ్రగ్-ఫ్రీ తెలంగాణ కోసం అందరూ భాగస్వాములు కావాలి

**జయభేరి, హైదరాబాద్ :**

జూన్ 26న జరగనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా, EAGLE ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి, తెలంగాణ రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల



మొదటిపేజీ తరువాయి

## మహిళా సాధికారతకు పెద్దపీట

మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ కేంద్రాల నిర్వహణ వంటి అవకాశాల ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం. గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతి మహిళా నాయకురాలికి పార్టీ అండగా ఉంటుంది. కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, అవకాశాలు కల్పిస్తాం. అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో మహిళలు చురుగ్గా పాల్గొని ప్రతి అర్హుడి ఓటు నమోదు అయ్యేలా కృషి చేయాలి.

## డ్రగ్స్ యువత భవిష్యత్తుకు ముప్పు

ముప్పు నుండి పూర్తిగా విముక్తి చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని మరోసారి పునరుద్ఘాటించాను. ఈ సందర్భంగా పిల్లలు, యువతతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించి, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తులు, కుటుంబాలపై చూపే వినాశకర ప్రభావం, మాదకద్రవ్యాల వ్యాపారాన్ని నడిపించే డిమాండ్‌సరఫరా వ్యవస్థ, వాటి నియంత్రణ కోసం చేపడుతున్న చర్యల గురించి వివరించాను. పిల్లలు, యువతను మాదకద్రవ్యాల బారిన పడేలా ప్రలోభపెట్టే వారు దేశానికే ద్రోహం చేస్తున్నట్లేనని హెచ్చరించాను. ఏ కుటుంబమూ తమకు ఈ సమస్య తలెత్తదని భావించకూడదని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి తమ పిల్లలతో ఎక్కువ సమయం గడపాలని సూచించాను. తెలంగాణ పోలీస్‌లో ప్రతిఒక్కరు "మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటాన్ని" వ్యక్తిగత బాధ్యతగా భావించి, అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేయాలని పిలుపునిచ్చాను. విద్యాసంస్థల్లో త్వరలోనే యాంటీడ్రగ్ మరియు సేఫ్టీ క్లబ్‌లను తప్పనిసరి చేయనున్నాము. విద్యాసంస్థలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, మాదకద్రవ్యాల వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన ఏవైనా సంకేతాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

## ఢిల్లీలో రేవంత్ బిజీ బిజీ

ఈ సమావేశంలో కిషన్ రెడ్డి కూడా  పాల్గొని రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారని సమాచారం. ఈ కీలక సమావేశంలో తెలంగాణకు సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై చర్చించనున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ టేకోవర్, మెట్రో ఫేజ్ 2 విస్తరణతో పాటు, వీటికి సంబంధించిన ఐఆర్‌ఎఫ్ రుణాల విడుదల అంశాలపై కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా చర్చించనున్నారు. రాష్ట్ర నిధులు, అభివృద్ధి విషయంలో లేఖల యుద్ధం కొనసాగిస్తున్న రేవంత్, కిషన్ రెడ్డి ఢిల్లీలో ఒకే సమావేశంలో పాల్గొనుండటం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ భేటీ తర్వాత తెలంగాణ మెట్రో ప్రాజెక్టులకు కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తుందని కాంగ్రెస్ నేతలతో పాటు రాష్ట్ర ప్రజలు ఆశిస్తున్నారు.

## ప్రభుత్వంపై కుట్రలు

పాత రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ అనేది అతి పెద్ద టాస్క్‌గా ఉండేదని, కానీ ఇప్పుడు టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక ఆ ప్రక్రియ చాలా సులభతరమైందని గుర్తుచేశారు. పాలనలో వినూత్నంగా ఆలోచించకపోతే వ్యవస్థలు నిర్వీర్యమవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.
పాత కేసుల ట్రేసింగ్.. తప్పు చేసిన వాడు తప్పించుకోలేడు!
ఇటీవల కాలంలో డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు అలవాటు పడి, మానసిక సమస్యల కారణంగా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. "తప్పు చేసిన వాడు ఎప్పుడూ చట్టం నుంచి తప్పించుకోలేడు. 2019లో జరిగిన కొన్ని పాత నేరాలను సైతం ఇప్పుడు పోలీసులు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారు, వారికి శిక్షలు కూడా పడుతున్నాయి. ఇలాంటి విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది." అని అన్నారు దీనితో పాటు వాహనాల నెంబర్ ప్లేట్ల విషయంలో ప్రమాణాలను, నిబంధనలను పక్కాగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సాంకేతిక ప్రగతిని వివరిస్తూ.. రాబోయే డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్‌ను లాంచ్ చేయాల్సి ఉందని, ఈలోగా క్వాంటం పార్క్, సెమీ కండక్టర్ల పార్క్ ఏర్పాటుకు అవసరమైన వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీటితో పాటు రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పరిసరాల పరిశుభ్రత, నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణ, నదీ జలాలను కాలుష్యం నుంచి కాపాడడం వంటి అంశాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కీలక సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో పాటు వివిధ శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో వర్షాల దండయాత్ర

పరిస్థితులు ఏర్పడే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అసమాన వర్షపాతం కారణంగా భవిష్యత్తులో పలు పట్టణాలు, గ్రామాల్లో నీటి కొరత సమస్య తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను సమర్థవంతంగా వినియోగించుకోకపోతే రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. తెలంగాణలోని పలు పట్టణాల్లో భూగర్భ జలాల మట్టం ఇప్పటికే ఆందోళనకర స్థాయికి చేరిందని అధికారులు గుర్తుచేస్తున్నారు. వర్షపు నీటిని సంరక్షించేందుకు ప్రతి ఇంట్లో, ప్రతి కాలనీలో వర్షపు నీటి సేకరణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఇంకుడు గుంటలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ప్రజలు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ, నీటి వనరుల శాఖ అధికారులు సూచిస్తున్నారు. రోజువారీ అవసరాలకు మాత్రమే నీటిని వినియోగించడం, వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం, భూగర్భ జలాలపై ఆధారాన్ని తగ్గించే చర్యలు చేపట్టడం అవసరమని చెబుతున్నారు. రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. పంట పొలాల్లో నీరు నిల్వ కాకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ పనులు చేపట్టాలని సూచించారు. మొత్తంగా రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, ఎల్‌నీనో ప్రభావం కారణంగా భవిష్యత్తులో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## మా పొట్ట కొట్టొద్దు

దీనివల్ల భారత్ లో యాపిల్, ఆల్ మండ్స్, వాల్ నట్స్, ఇతర దేశీయ హార్టికల్చర్ పంటలను పండించే లక్షల మంది రైతుల జీవనోపాధి దెబ్బతింటుంది. ఇక అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశం.. ఇప్పటికే అక్కడి రైతులను సబ్సిడీలు అందిస్తోంది. దాంతో అక్కడి వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గిస్తే.. ఆ ప్రొడక్ట్స్ తో భారత్ లోని చిన్న, సన్నకారు రైతులు పోటీపడటం అసాధ్యం.. అని హిల్ స్టేట్ హార్టికల్చర్ ఫోరమ్ తన లేఖలో పేర్కొంది. ఇక హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్ తదితర కొండ ప్రాంతాల రాష్ట్రాల్లో స్థానిక వాతావరణ పరిస్థితుల కారణంగా యాపిల్, వాల్ నట్ తదితర పంటలను పండించే రైతులు.. ప్రత్యామ్నాయ పంటలకు మారడం చాలా అరుదు. అందువల్ల దిగుమతులు పెరిగితే వీరి జీవనోపాధి, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై హిల్ స్టేట్ హార్టికల్చర్ ఫోరమ్ కన్వీనర్ హరీష్ చౌహాన్ మాట్లాడుతూ.. తమ అభ్యర్థనను ప్రధాని మోదీ స్వాగతిస్తారని.. రైతుల ఆవేదనను అర్థం చేసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విరాళాల వివాదం



అయోధ్య వేర్వేరు సందర్భాల్లో దేశ విదేశాల దృష్టిని ఆకర్షించింది. అయితే ఈసారి కారణం ఆలయ ఉద్యమం, దాని వైభవం లేదా భక్తుల రద్దీ కాదు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ పనితీరు, ఆలయ విరాళాల చుట్టూ తలెత్తుతున్న తీవ్ర అవకతవకల ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ రామ్ జన్మభూమి ట్రస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. ట్రస్ట్ కళ్లముందే ఆలయ విరాళాలు, కానుకల లెక్కల్లో పెద్ద ఎత్తున తేడాలు జరిగాయని, రామాలయ కానుకల నుంచి కోట్ల రూపాయలు మాయమయ్యాయని ఆయన ఆరోపిస్తున్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలతో పాటు స్థానిక మాజీ కరసేవకుడు సంతోష్ దూబే, బీజేపీ నాయకుడు డాక్టర్ రజనీశ్ సింగ్ తదితరులు ఈ అవకతవకలను ప్రస్తావిస్తూ జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రస్తుతం ఈ ఆరోపణలపై విచారణ సాగిస్తోంది. అయితే, ఈలోగా అయోధ్య స్థానికులు, ఇక్కడికి వచ్చే భక్తులలో తీవ్ర నిరాశ, ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తున్నాయి. కోట్లమంది నమ్మకం, త్యాగాల ఫలితంగా నిర్మితమైన ఆలయం చుట్టూ ఇలాంటి ఆర్థిక ఆరోపణలు రావడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీన్ని అయోధ్యకు మచ్చ తెచ్చే అంశంగా భావిస్తే, మరికొందరు పారదర్శకత కోసం విచారణ అవసరమని అంటున్నారు. ఈ వివాదాలన్నింటికీ కేంద్ర బిందువుగా మారిన శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో జనరల్ సెక్రటరీ, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడైన చంపత్ రాయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. 2020 ఫిబ్రవరిలో అయోధ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత, న్యాయస్థానం ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. 15 మంది సభ్యులతో కూడిన ఈ ట్రస్ట్‌లో అధ్యక్షుడిగా మహంత్ నృత్య గోపాల్ దాస్, కోశాధికారిగా స్వామి గోవింద్ దేవ్ గిరి, సీనియర్ న్యాయవాది కె. పరాశరన్, డాక్టర్ అనిల్ మిశ్రా, కామేశ్వర్ చౌపాల్, మహంత్ దినేంద్ర దాస్ సహా పలువురు మత, సామాజిక ప్రతినిధులు ఉన్నారు. ట్రస్ట్ జనరల్ సెక్రటరీగా ఉన్న చంపత్ రాయ్.. దీని రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించే అత్యంత కీలకమైన అధికారి. ఆలయ నిర్మాణ ప్రాజెక్టు, విరాళాలుకానుకల నిర్వహణ, అధికారిక సంప్రదింపుల బాధ్యత ఆయనపైనే ఉండటంతో మీడియా ప్రతినిధులు ఆయన సమాధానం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఒక వీడియోలో చంపత్ రాయ్ ఈ ఆరోపణలను ఖండించారు.
" శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రం తన వివిధ పనులకు సంబంధించి సమయానుసారం ఆడిట్ నిర్వహిస్తూనే ఉంటుంది. హుండీ కౌంటింగ్ రూమ్ ఆడిటింగ్‌ను రామాలయ తీర్థ క్షేత్ర ట్రస్టీలు, కార్యకర్తలు, స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు కలిసి చేస్తారు. ఈ ప్రక్రియ చాలా రోజుల పాటు సాగుతుంది. ప్రస్తుతం ఆ పనే జరుగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి తప్పులూ మా దృష్టికి రాలేదు'' అన్నారు. చంపత్ రాయ్‌ను సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ ఎలాంటి స్పందనా రాలేదు. ఆయన సాధారణంగా అయోధ్యలోని కరసేవక్ పురంలో నివసిస్తుంటారు. కానీ, మేం అక్కడికి వెళ్లినప్పుడు.. గత ఏడెనిమిది రోజులుగా, అంటే సిట్ దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి ఆయన ఆలయ ప్రాంగణంలోనే ఉంటున్నారని విశ్వహిందూ పరిషత్ సభ్యుడొకరు మాకు తెలిపారు. అయోధ్యలోని స్థానికులు, వ్యాపారులు, సంత్‌మహంత్‌లు లేదా రామాలయంతో సంబంధం ఉన్న సామాజిక, మతపరమైన సంస్థల ప్రతినిధులు.. ఇలా వరితో మాట్లాడినా, వారిలో చాలామంది తాజా వివాదం విని తామేమీ ఆశ్చర్యపోలేదని చెప్పారు. గత కొన్నేళ్లుగా ఆలయం, ట్రస్ట్‌కు సంబంధించి రకరకాల వార్తలు, చర్చలు ఎప్పటికప్పుడు బయటకు వస్తూనే ఉన్నాయని, అందుకే ఈ ప్రశ్నలు తలెత్తడం తమకు కొత్తేమీ కాదని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే చంపత్ రాయ్ పాత్రపై అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. అవకతవకల్లో చంపత్ రాయ్ వ్యక్తిగత ప్రమేయం ఉండే అవకాశం లేదని ఆయన మద్దతుదారులు నమ్ముతున్నారు. మరోవైపు, విమర్శకులు మాత్రం ఆయనకు తెలియకుండా ఇంత పెద్ద స్థాయిలో పొరపాట్లు జరగడం అసాధ్యమని వాదిస్తున్నారు. వ్యక్తిగత నిజాయితీ ఎలా ఉన్నా, సంస్థలో జరిగే వాటికి ఆయనే జవాబుదారీ వహించాలని స్పష్టం చేస్తున్నారు. ట్రస్ట్‌పై ఇలాంటి ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2021లో అయోధ్యలో కొనుగోలు చేసిన ఒక భూమికి సంబంధించి ట్రస్ట్‌పై ఆరోపణలు వచ్చాయి. ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు దీనిపై స్పందిస్తూ.. 'ఒక వ్యక్తి రెండు కోట్ల రూపాయలకు కొన్న భూమిని, ఆ ఒప్పందం జరిగిన కొద్ది నిమిషాలకే ట్రస్ట్ 18.5 కోట్ల రూపాయలు చెల్లించి కొనుగోలు చేసింది' అని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్‌తో పాటు పలు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ విషయంలో పారదర్శకత ఉండాలని కోరాయి. అయితే, చంపత్ రాయ్, ట్రస్ట్ ఈ ఆరోపణలను తిరస్కరించారు. భూమి కొనుగోళ్లన్నీ పారదర్శకంగా జరిగాయని, చెల్లింపులన్నీ బ్యాంకింగ్ మార్గాల ద్వారానే చేశామని, మార్కెట్ ధర కంటే తక్కువకే ఆ భూమిని ట్రస్ట్ కొనుగోలు చేసిందని స్పష్టం చేశారు. ఈ ఆరోపణలు 'తప్పుదోవ పట్టించేవిగా, 'రాజకీయ దుర్బుద్ధితో కూడినవిగా' ఉన్నాయని చంపత్ రాయ్ కొట్టిపారేశారు. కానీ, రాజకీయ పార్టీలు ఇప్పుడు మరోసారి ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి. 2021లో కూడా ఈ ఆరోపణలపై విచారణ జరిగిందని, అయితే దాని వల్ల ఏమీ తేలలేదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు, అయోధ్య మాజీ ఎమ్మెల్యే పవన్ పాండే అంటున్నారు. ఆ విచారణ ఎలాంటిది, ఎవరు చేశారు, దాని వల్ల తేలిందేమిటి అనే విషయాలపై  ఇప్పటివరకు ఎలాంటి కచ్చితమైన సమాచారం లభించలేదు.



# రైతు భరోసా

- అన్నదాతలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీపి కబురు
- ఈ విడతలో మొత్తం 73 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 9,000 కోట్లను జమ చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళిక
- ఈ వానాకాలం సీజన్ నుంచి 7.20 గుంటల వరకు భూమి ఉన్న వారికే భరోసా సాయం పరిమితం చేయాలని ప్రభుత్వం ఆలోచన

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలోని అన్నదాతలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆర్థిక భారం ఎక్కువైనా సరే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈనెల 30న ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరగనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. ఈ విడతలో మొత్తం 73 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 9,000 కోట్లను జమ చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. గత యాసంగి సీజన్‌లో కేవలం రెండు ఎకరాల లోపు ఉన్న వారికే పెట్టుబడి సాయం అందించడంతో రైతుల నుంచి కొంత వ్యతిరేకత వచ్చింది. ఈసారి ఆ పరిస్థితి రాకుండా అందరికీ ఒకేసారి నిధులు జమ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒకవేళ నిధుల కొరత ఏమైనా ఎదురైతే, మొదట ఎకరం చొప్పున ప్రారంభించి, 9 రోజుల్లో పూర్తిగా పంపిణీ పూర్తి చేసేలా వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ ప్లాన్‌ను కూడా సిద్ధం చేసుకుంది. గత ప్రభుత్వంలా కాకుండా.. ప్రజల సొమ్ము వృథా కాకుండా కేవలం నిజమైన, సాగు చేసే రైతులకే ఈ సాయం అందేలా రేవంత్ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోబోతోంది. రాష్ట్రంలో ఉన్న 1.50 కోట్ల ఎకరాల భూమిలో సాగుకు పనికిరాని పడావు భూములు, రియల్ ఎస్టేట్ లేఅవుట్లు, కాలువలు, కుంటలు, బీడు భూములు ఉన్న 20 నుంచి 25 లక్షల ఎకరాలను భరోసా జాబితా నుంచి ఇప్పటికే తొలగించనున్నారు.
ధనవంతులైన పెద్ద రైతులకు కాకుండా పేద, మధ్యతరగతి రైతులకు లబ్ధి చేకూర్చేలా ఈ వానాకాలం సీజన్ నుంచి 7.20 గుంటల వరకు భూమి ఉన్న వారికే భరోసా సాయం పరిమితం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. 10 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్నవారిని ఈ జాబితా నుంచి మినహాయించే అవకాశం ఉంది. పత్తి వంటి పంటలు రబీలో సాగు చేయనందున, రైతు భరోసాను కేవలం ఒకే ఒక ప్రధాన ఖరీఫ్ సీజన్‌కే పరిమితం చేయాలా? అనే కోణంలోనూ ప్రభుత్వ పెద్దలు సమాలోచనలు చేస్తున్నారు. ఎన్నికల హామీ ప్రకారం ఎకరానికి రూ. 15 వేలు ఇస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తిరుగుండదని, అలాగే కౌలు రైతులను ఆదుకునేందుకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కొందరు మంత్రులు సీఎంకు ప్రతిపాదనలు పెట్టారు. ఇకపై రైతు భరోసాలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం హైటెక్ టెక్నాలజీని వాడుతోంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్విట్జర్లాండ్ దేశానికి చెందిన సార్ మ్యాప్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని శాటిలైట్ చిత్రాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో ఏ గ్రామంలో, ఏ సర్వే నంబర్‌లో, ఏ పంట వేశారనేది 95 శాతం ఖచ్చితత్వంతో గుర్తించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద జిల్లాకు 5 గ్రామాలను ఎంపిక చేసి ఏఈఓ లతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించగా శాటిలైట్ వివరాలు, క్షేత్రస్థాయి వివరాలు ఒక్కటిగానే వచ్చాయి. దీనివల్ల కేవలం పంట సాగు చేసిన వారికే ప్రభుత్వ పథకాలు అందుతాయి.
అంతేకాకుండా ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే నేరుగా నష్టపరిహారం అందించడానికి, విత్తనాలుఎరువులు ముందే సిద్ధం చేసుకోవడానికి ఈ డేటా ప్రభుత్వానికి ఎంతో ఉపయోగపడనుంది. ప్రభుత్వం తీసుకోబోతున్న ఈ విప్లవాత్మక మార్పులతో నిజమైన పేద రైతులకు పూర్తి స్థాయిలో భరోసా దక్కనుందని స్పష్టమవుతోంది.

## కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముగిసిన రేవంత్ భేటీ

- ఐఆర్‌ఎఫ్‌సీ లోన్‌పై ప్రధాన చర్చ
- కేంద్రమంత్రి ఖట్టర్‌తో భేటీ.. మెట్రో ఫేజ్-2పై ఫోకస్



**జయభేరి, న్యూఢిల్లీ:**

ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రూ. 13,600 కోట్ల విడుదలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌తో జరిగిన ఈ చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో జరిగాయని, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి సానుకూల స్పందన వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో జరిపిన కీలక సమావేశం ముగిసింది. దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

**ఐఆర్‌ఎఫ్‌సీ లోన్‌పై ప్రధాన చర్చ**

ఈ ప్రత్యేక సమావేశంలో తెలంగాణకు సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టులు, నిధుల కేటాయింపులతో పాటు ప్రధానంగా ఐఆర్‌ఎఫ్‌సీ (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) లోన్ అంశంపై ఇరు పక్షాల మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రూ. 13,600 కోట్ల విడుదలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌తో జరిగిన ఈ చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో జరిగాయని, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి సానుకూల స్పందన వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు.

**కేంద్రమంత్రి ఖట్టర్‌తో భేటీ.. మెట్రో ఫేజ్-2పై ఫోకస్**

ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి మరో కీలక భేటీలో పాల్గొననున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఆయన సమావేశం కానున్నారు. ఈ భేటీలో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ 2 ప్రాజెక్టు విస్తరణ, కేంద్ర ప్రభుత్వ వాటా, నిధుల మంజూరుపై ప్రధానంగా చర్చించనున్నారు. రేపు కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో జరిగే ఈ అత్యంత ప్రాధాన్యత కలిగిన సమావేశానికి కూడా కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి హాజరుకానున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# నిదానపురంలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు

- బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహణ
- మెడికేర్ హాస్పిటల్ తొర్రూరు వారి సౌజన్యం తో

**జయభేరి, దంతాలపల్లి, జూన్22 :**




మండలంలోని నిదానపురం గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు పెట్టడం జరిగింది. తొర్రూర్ మెడికేర్ హాస్పటల్ నుండి డాక్టర్ నరేష్ హెల్త్ చెకప్ నిర్వహించడం జరిగింది, గ్రామ సర్పంచి పూజ రేణుక జనార్ధన్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ నరేష్ వడదెబ్బ తీవ్రత గురించి సీజనల్ వ్యాధుల గురించి వివరించడం జరిగింది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉందని వారు గుర్తు చేశారు ప్రతి ఒక్కరు ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకోవాలని, కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత తమ వంతు ఉందని తెలియచెప్పారు ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఆహార లోపం నీటి సమస్య వల్ల ఎక్కువగా జబ్బులు వస్తున్నాయి కాబట్టి ఆహార అలవాట్లను పరిశుభ్రమైన వాతావరణాన్ని మంచి శుభ్రమైన నీటిని తాగడం వల్ల పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచవచ్చు మెడికల్ హాస్పిటల్ తరఫున ఎలాంటి టెస్టులైన చేయడం జరుగుతుంది. బీపీ షుగర్ టెస్టులు ఈరోజు నిర్వహించడం జరుగుతుంది. మిగతా టెస్టుల్లో హాస్పటల్ కి వచ్చిన వారికి 10% టెస్టుల్లో ఫ్రీ ,మెడిసిన్ లో కూడా 20% ఫ్రీ, అంబులెన్స్ 24 అవర్స్ సౌకర్యం కలదు. కాబట్టి మా సేవలను వినియోగించుకోవాలని చైర్మన్ రాములు వివరించారు.

డాక్టర్ కూడా 24 గంటలు అందుబాటులో ఉంటారు అని వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూజారి రేణుక జనార్ధన్లు, బాలవికాస కోఆర్డినేటర్స్ సుకన్య, శోభ, చైర్మన్ రాములు హాస్పటల్ సిబ్బంది సాయి, శిరీష ,కీర్తి ,వార్డ్ నెంబర్లు గ్రామ పెద్దలు సుధాకర్ ,నవీన్ ,నరాల మరియమ్మ, మంది లీడర్లు, సభ్యులు 135 మంది కి బీపీ షుగర్ టెస్టులు చేయడం,డాక్టర్ చెకప్ చేయించుకోవడం జరిగింది.



## ఉచిత మెగా వైద్య శిబిరం

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 22 :**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా టీ బి ముక్త్ భారత్ కార్యక్రమం లో భాగంగా గ్రామంలో జిల్లా టీ బి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ రుచిరా రెడ్డి ఆదేశంతో సంయుక్తంగా నిర్వహించిన ఉచిత టీ బి పరీక్షలు, ఎక్రే శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దొమ్మాట అనురాధ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా టీ బి సూపర్వైజర్ శాంతి మాట్లాడుతూ టీ బి ని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందితే త్వరగా పూర్తిగా నయం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రాజయ్య , ఉపసర్పంచ్ బాల నరసయ్య, వార్డు సభ్యులు, పిహెచ్ సి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంట నష్టం చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని ఎస్ఐకి దరఖాస్తు



**జయభేరి, దంతాలపల్లి, జూన్ 22 :**

పంటను ధ్వంసం చేసిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన బత్తిని రాములు, బత్తిని వెంకన్న కోరారు. ఈ మేరకు ఎస్సై రవికుమార్ కి సోమవారం వినతిపత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ దంతాలపల్లి మండం కుమ్మరికుంట్ల గ్రామ శివారులోని తన 0:20 ఎకరాల భూమిలో 45 ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల కొంతమంది తన భూమిన కబ్జా కి ప్రయత్నించగా తహసిల్దార్ కి, ఎస్సై కి ఫిర్యాదు చేశామని, పోలీసులు వచ్చి ఎంక్వయిరీ కూడా చేశారని. అయితే వారం కిందట పెసర పంటనుసాగు చేయగా కొంతమంది వ్యక్తులు డోజర్ తో పంటను నాశనం చేయడంతో పాటు అడ్డు వచ్చిన తమాపై దాడికి ప్రయత్నించారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## జూలై 6 కు ఆర్జున్ కేసు నమోదు

**జయభేరి, హైదరాబాద్ :**

సంధ్య థియేటర్ తొక్కిసిలాట కేసు విచారణ జులై 6కు వాయిదా పడింది. సోమవారం నాడు అల్లు అర్జున హాజరు కావాల్సి వుండగా అయన విచారణకు హాజరు కాలేదు. అల్లు తరపు న్యాయవాదులు అబ్సెంట్ పిటిషన్ వేసారు. ఆదేశాలు ఇచ్చినా అల్లు అర్జున్ రాకపోవడంతో మెమో దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. ఇదే కేసులో కోర్టుకు 12 మంది నిందితులు హజరయ్యారు.

# బొబ్బిలి చెరువులో అక్రమ మట్టి రవాణాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, హెచ్ఎండీఏ ప్లాట్లపై బీఆర్ఎస్ వినతి
- షాద్ నగర్ నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**జయభేరి, షాద్ నగర్, జూన్ 22 :**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ ప్రజా సమస్యల గురించి బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ....గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి పారదర్శకతతో అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా షాద్‌నగర్ పట్టణ పరిధిలోని బొబ్బిలి చెరువులో గత నెల రోజులుగా జరుగుతున్న అక్రమ మట్టి రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు కేటాయించిన హెచ్ఎండీఏ ప్లాట్లను లబ్ధిదారులకు తక్షణమే రిజిస్ట్రేషన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు అద్భుత అవకాశం

- ఎస్ఐఆర్ ప్రక్రియ.. హంసా కృష్ణ గౌడ్

**జయభేరి, మేడ్చల్, జూన్ 22:**



ఓటరు జాబితాలో అర్హులైన ఓటర్ల పేర్లు కొనసాగిస్తూ, అనర్హుల పేర్లను తొలగించే లక్ష్యంతో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ తెలంగాణ ప్రజలకు ఒక మంచి అవకాశమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సముద్రాల హంసా కృష్ణ గౌడ్ అన్నారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత అని, ఓటరు జాబితాలో తమ పేరు సక్రమంగా ఉండేలా ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జూన్ 25 నుంచి జూలై 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) అందజేసే ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజలు బాధ్యతాయుతంగా పూర్తి చేసి నిర్దేశిత గడువులోపు తిరిగి సమర్పించాలని కోరారు. ఫారాలను ఎలా నింపాలి, ఎక్కడ సమర్పించాలి అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ సమావేశం నిర్వహించారని చెప్పారు. భారత ఎన్నికల కమిషన్ ఇప్పటికే దేశంలోని 12 రాష్ట్రాల్లో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిందని, ప్రస్తుతం తెలంగాణతో పాటు మరో 16 రాష్ట్రాల్లో అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలు బీఎల్ఓలకు పూర్తిస్థాయిలో సహకరించి ఓటరు జాబితాల ప్రక్షాళనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన సదస్సులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రషర్ ఏర్పాటు పేరుతో భూముల్లోకి రానివ్వడం లేదంటూ రైతుల ఆవేదన



**జయభేరి, మేడ్చల్, జూన్ 22:**

క్రషర్ వ్యాపారం కోసం కొందరు తమ సాగు భూములను ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని మేడ్చల్ జిల్లా ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని రావల్‌కోల్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన వారు, గత కొన్ని సంవత్సరాలుగా గ్రామ పరిధిలోని నాలుగు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు ఆ భూమిలో క్రషర్ ఏర్పాటు చేయనున్నట్లు చెబుతూ భూమిని చదును చేసే పనులు చేపట్టారని, తాము అక్కడికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ భూమే తమ కుటుంబాలకు ఏకైక జీవనాధారమని, కుటుంబంలో మగదిక్కు కూడా లేదని, చదువుకుంటున్న కుమార్తెల భవిష్యత్తు ఈ భూమిపైనే ఆధారపడి ఉందని వారు వాపోయారు. తరతరాలుగా ఇదే భూమిలో సాగు చేస్తున్నామని పేర్కొన్న రైతులు, భూమి యాజమాన్యం మరియు సాగు హక్కుల విషయంలో ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భూమి వివాదాన్ని అధికారులు వెంటనే పరిశీలించి, రైతుల హక్కులను పరిరక్షించాలని కోరారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



# మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం

- మేడ్చల్‌లో మొహర్రం పీర్ల దర్గా దర్శించిన రాఘవేంద్ర గౌడ్

**జయభేరి, మేడ్చల్, జూన్ 22:**

మొహర్రం పండుగను మేడ్చల్ పట్టణంలో ప్రజలందరూ కలిసి జరుపుకోవడం మత సామరస్యానికి ప్రతీకగా అని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని 297వ డివిజన్‌లో కటిక సాధుల్లా కిషన్ వంశీయులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మొహర్రం (పీర్ల) పండుగ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు రామన్న గారి రాఘవేంద్ర గౌడ్ సోమవారం పీర్ల దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గాకు విచ్చేసిన రాఘవేంద్ర గౌడ్‌కు నిర్వాహకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. మొహర్రం పండుగ కులమతాలకు అతీతంగా సోదరభావానికి, గంగాజమునా తెహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందని రాఘవేంద్ర గౌడ్ పేర్కొన్నారు. పీర్ల పండుగను అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా జరుపుకోవడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొడే మహేష్, నాయకులు ప్రమోద్, కటిక వినయ్, శంకర్, రాము, జితేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పీర్లను దర్శించుకుని ప్రార్థనలు నిర్వహించారు.

## రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్ కు ఏబీవీపీ పిలుపు




**జయభేరి, మేడ్చల్, జూన్ 22:**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) ఆధ్వర్యంలో ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ టెక్నికల్ సెల్ స్టేట్ కోకన్వీనర్ కుడికాల హర్షిత్ తెలిపారు. మేడ్చల్ నగర శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 23 వేల పాఠశాలలను ఎత్తివేసే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడిని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని ఆయన అన్నారు. గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టడంతో పాటు జాతీయ విద్యా విధానం (NEP2020)ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలను బలవంతంగా నిర్వహిస్తున్నాయని ఆరోపించిన ఆయన, అలాంటి విధానాలను నిషేధించాలని కోరారు. విద్యా రంగానికి సంబంధించిన ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు ABVP పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో ABVP నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- విద్యార్థులకు మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి పిలుపు



**జయభేరి, మేడ్చల్, జూన్ 22:**

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి సూచించారు. సోమవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హితం కళాశాలలో మేడ్చల్ పోలీసుల ఆధ్వర్యంలో "సే నో టు డ్రగ్స్" అంశంపై మెగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ శంకర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన నష్టాలు, కుటుంబాలు మరియు సమాజంపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. దేశవ్యాప్తంగా అమలులో ఉన్న ఎన్‌డీపీఎస్ (NDPS) చట్టం ప్రకారం డ్రగ్స్ సేవించినా, విక్రయించినా కఠినమైన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థులు చదువుపై పూర్తి శ్రద్ధ సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం, విక్రయాలు లేదా అనుమానాస్పద కదలికలు గమనించినట్లయితే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ విక్రయదారులపై సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులందరితో "డ్రగ్స్ వద్దు.. జీవితమే ముద్దు" అనే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ సీఐ ఎ. సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు. సుమారు 400 మందికి పైగా విద్యార్థులు సదస్సుకు హాజరై అవగాహన పొందారు.



## క్షీరసాగర్ జెడ్పీహెచ్ఎస్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

జయభేరి, గజ్వేల్/ ములుగు జూన్ 22 :

ములుగు మండలం క్షీరసాగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2026 సంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా KMR చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొన్యాల ఉమ నరసింహారెడ్డి, TEAM KNR సభ్యులు మరియు అంబేద్కర్ యూత్ కలిసి పాఠశాలలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన కుందనపల్లి సిరిని ప్రత్యేకంగా సన్మానించి మెమెంటోతో పాటు నగదు బహుమతి అందజేశారు.అలాగే మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన మరో ఐదుగురు విద్యార్థులకు కూడా నగదు బహుమతులు, మెమెంటోలు అందించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ, విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. స్థానికులు, తల్లిదండ్రులు మరియు పాఠశాల సిబ్బంది ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

## ధాన్యం కొనుగోలును వేగవంతంగా పూర్తి చేయాలి



జయభేరి, తుర్కపల్లి, జూన్ 22 :

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగవంతంగా పూర్తి చేయాలని తాసిల్దార్ రవి కుమార్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి వెంట వెంటనే లారీల ద్వారా గోదాములకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. వర్షాకాల దృశ్య ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దాన్యమును తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దాన్యం నిర్వాహకులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు




జయభేరి, తుర్కపల్లి, జూన్ 22 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని పడాల ముత్యాల మెమోరియల్ పాఠశాలలో సామాజిక అవగాహన కార్యక్రమంలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పాఠశాల పిల్లలకు డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ ప్రదీప్ మాట్లాడుతూ పిల్లలకు మాదక ద్రవ్యాల నష్టంను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహ రెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ శివ, మీరా, ఆంజనేయులు, సాయి కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరలోనే చెంగిచెర్ల రోడ్డు పనులు ప్రారంభం

- విద్యుత్ స్తంభాల మార్పుకు నిధుల మంజూరు



జయభేరి, మేడిపల్లి :

చెంగిచెర్ల రోడ్డు విస్తరణ పనులకు ప్రధాన అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్థంభాల మార్పుకు నిధులు మంజూరు కావడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో బోడుప్పల్ -చెంగిచెర్ల ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగవంతం కానున్నాయి. ఈ సందర్భంగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం రోడ్డు విస్తరణ పనులు ఇక ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతాయని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రహదారిని ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, బుక్య సుమన్, సీనియర్ నాయకులు జంగారెడ్డి, బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప, విద్యుత్ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వండి

- మేడ్చల్ కలెక్టర్ కు విజ్ఞప్తి

జయభేరి, ఉప్పల్ :



జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించి వారందరికీ అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డ మీది బాలరాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా జర్నలిస్టుల ప్రతినిధుల బృందం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా అర్బన్ జిల్లా కావడం వల్ల ప్రధాన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రతి మండలంలో ఇద్దరు కంటే ఎక్కువ మంది విలేకరులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అక్రిడిటేషన్ జీవో 252 మేరకు మండలానికి ఒకే అక్రిడిటేషన్ ఇచ్చే అవకాశం ఉండడంవల్ల ఇతరులు నష్టపోయే ప్రమాదం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన పత్రికల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా సంస్థల నుంచి ఇచ్చిన సిఫార్సు లేఖలలో పేర్లు కలిగి ఉండి జీవో మేరకు అర్హులు కాని వారిని గుర్తించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా జిల్లా జర్నలిస్టులందరికీ న్యాయం చేసిన వారు అవుతారని కలెక్టర్ ను కోరారు.

**సానుకూలంగా స్పందించిన కలెక్టర్**

జిల్లాలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల అంశంలో అన్యాయం జరగకుండా చూస్తామని కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. జర్నలిస్టుల బృందం చేసిన విజ్ఞప్తి మేరకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రవిచంద్ర, జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు రామారావు, రవీందర్, రామకృష్ణ, బాల్ రెడ్డి, సునీల్, శ్రీరాములు, రచ్చ శ్రీనివాస్, హనుమంత రెడ్డి, యూనియన్ జిల్లా నాయకులు భూపాల్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బిఎల్ఎలకు SIR పై ప్రత్యేక శిక్షణ

- శిక్షణ శిబిరంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి

జయభేరి, మేడిపల్లి :



మల్కాజ్గిరి కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్‌లోని బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో SIR ప్రక్రియపై కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్‌మల్కాజ్గిరి డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ, SIR ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా BLAలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు, లోపాలు లేకుండా చూసుకోవడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో BLAలు ముఖ్య భూమిక పోషించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బిబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, సింగిరెడ్డి పద్మారెడ్డి, కొత్త చందర్ గౌడ్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, భూక్య సుమన్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా చాడ కొండల్ రెడ్డి

జయభేరి, కరీంనగర్ జిల్లా, జూన్ 22 :

సైదాపూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సైదాపూర్ మండల అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన చాడ కొండాల్ రెడ్డి కి గతంలో పార్టీ చేసిన సేవలు గుర్తించి సైదాపూర్ మండల అధ్యక్షునిగా నియమించారు. పార్టీ అధిష్టానం నాయకత్వంలో మండలంలోని కాంగ్రెస్ పార్టీ 10 సంవత్సరాలు నుండి కష్టపడ్డా కార్యకర్తకు గుర్తించింది. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్త మాజీ ఎంపీటీసీగా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని పార్టీ శ్రేణులను సమన్యాయం చేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షిస్తున్నాము. పదవి కాలంలో విజయవంతంగా సాగి పార్టీకి ప్రజలకు విశేష సేవలో అందించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు, కోరుకుంటున్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణం కోసం వినతిపత్రం

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరి ఐఏఎస్ కి వినతిపత్రం అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, కాప్రా :



కుషాయిగూడ ప్రధాన రోడ్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (PHC) భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో, అదే ప్రదేశంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన భవనాన్ని నిర్మించవలసిందిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్ మనూ చౌదరి ఐఏఎస్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కుషాయిగూడ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పాతబడిపోయి ప్రమాదకర స్థితికి చేరుకుందని తెలిపారు. భవనం బలహీనంగా మారడం వల్ల రోగులు, వైద్య సిబ్బంది, ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వివరించారు. ముఖ్యంగా గర్భిణీ మహిళలు, చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు వచ్చే తల్లిదండ్రులు, వృద్ధులు, ఇతర రోగులు ప్రస్తుత భవనం పరిస్థితి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల వైద్య సేవల అందించడంలో కూడా ఆటంకాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. కుషాయిగూడ, ఏఎస్‌రావునగర్, ఈసీఐఎల్, పరిసర ప్రాంతాల్లో జనాభా గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆధునిక సదుపాయాలు, విశాలమైన గదులు, తగిన పార్కింగ్, తాగునీరు, ఇతర అవసరమైన వసతులతో కూడిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని నిర్మించడం అత్యవసరమని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఆరోగ్య రక్షణను దృష్టిలో ఉంచుకొని ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నూతన భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పార్టీ నాయకులు మహేష్ గౌడ్, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సోమ శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, సహ కార్యదర్శి నాలచెరువుల జనార్దన్, సీనియర్ ఉపాధ్యక్షులు చల్ల వెంకటేష్, సారా అనిల్ ముదిరాజ్, గంప కృష్ణ, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు BRS పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజుల వసూళ్లపై జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం



జయభేరి, మెడ్చల్ :

మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతూ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్న విషయాన్ని నిరసిస్తూ BRSV నాయకులు మెడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి (DEO)కి వినతిపత్రం సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన BRSV నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించి, అధిక ఫీజుల వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి BRSV సంస్థ చేపట్టిన ఈ ప్రజా సమస్యకు పూర్తి మద్దతు ప్రకటించారు. విద్య హక్కు ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉండాలని, ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని ఆయన సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాల పరిరక్షణ కోసం BRSV చేపడుతున్న ఉద్యమాలకు తమ మద్దతు కొనసాగుతుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలువురు BRSV నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రత్యేక ఫీజు రాయితీ




- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించే దిశగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కీలక చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్య కోసం ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 50 మంది విద్యార్థులకు ప్రత్యేక ఫీజు డిస్కౌంట్ (రాయితీ) కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు స్వయంగా అనురాగ్ కళాశాలకు వెళ్లి కళాశాల యాజమాన్యంతో సమావేశమై విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజుల్లో రాయితీ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కళాశాల యాజమాన్యం 50 మంది విద్యార్థులకు ప్రత్యేక డిస్కౌంట్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం తీసుకుంటున్న చర్యలను అభినందించారు.



# ఏంట్రా బాబు ఈ క్రేజ్..

నోరా ఫతేహికి ఫిఫాతో అనుబంధం ఇదే మొదటిసారి కాదు. గతంలో 2022 ఫిఫా టోర్నమెంట్‌లోనూ ఆమె పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఈ 2026 ప్రదర్శన ఆమె క్రేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఈ చారిత్రాత్మక విజయం సాధించిన తర్వాత నోరా ఎంతో భావోద్వేగానికి గురైంది. తన సంతోషాన్ని, కృతజ్ఞతలను తెలుపుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. అందులో తన తల్లి, తోబుట్టువులతో పాటు తన పాత స్కూల్ టీచర్‌తో దిగిన ఫోటోలను షేర్ చేస్తూ, తన ప్రయాణంలో నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపింది. మొత్తానికి, అంతర్జాతీయ వేదికపై భారతీయ సంతతి ప్రతిభను చాటుతూ, నోరా ఫతేహి బాలీవుడ్ పరిధులు దాటి ఒక గ్లోబల్ ఎంటర్‌టైనర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. నోరా ఫతేహి 1992 ఫిబ్రవరి 6న కెనడాలోని టొరంటోలో ఒక మొరాకన్‌కెనడియన్ కుటుంబంలో జన్మించింది. ఆమెకు చిన్నప్పటి నుంచే డ్యాన్స్ అంటే ఎంతో ఇష్టం. ఎటువంటి అధికారిక శిక్షణ లేకుండా కేవలం వీడియోలు చూస్తూ సొంతంగానే డ్యాన్స్ నేర్చుకుంది. 2014లో 'రోర్: టైగర్స్ ఆఫ్ ది సుందర్బన్స్' అనే హిందీ సినిమాతో ఆమె బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అయితే, ఆమెకు అసలైన గుర్తింపు తెచ్చింది మాత్రం స్పెషల్ సాంగ్స్ మాత్రమే. బాలీవుడ్ చిత్రం సత్యమేవ జయతే లోని "దిల్బర్" రీమిక్స్ పాటతో నోరా రాత్రికి రాత్రే గ్లోబల్ స్టార్ అయిపోయింది. ఈ పాట యూట్యూబ్‌లో వందల మిలియన్ల వ్యూస్ సాధించి సరికొత్త రికార్డులు సృష్టించింది.



# భాగ్యనగరిలో మెగా హంగామా

అగ్ర హీరో చిరంజీవి ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఆయన కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో తన 158వ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మక కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రం ఇటీవలే పొల్లాచ్చిలో కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకున్నది. సోమవారం నుంచి హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ మొదలైంది. షెడ్యూల్‌కీ షెడ్యూల్‌కీ ఎక్కువ గ్యాప్ తీసుకోకుండా యమస్పీడ్‌లో షూటింగ్‌ని కానిచ్చేస్తున్నారు దర్శకుడు బాబీ. దానికి మెగాస్టార్ కూడా కావాల్సినంత సహకారం అందిస్తున్నారు. ఈ తాజా షెడ్యూల్‌లో చిరంజీవితోపాటు ప్రధాన తారాగణమంతా పాల్గొంటున్నారు. సినిమాలోని కీలకమైన టాకీ పార్ట్‌ని ఈ షెడ్యూల్‌లో పూర్తి చేయనున్నారు. ఇదిలావుంటే.. తాజాగా పొల్లాచ్చీ షెడ్యూల్‌కి సంబంధించిన విశేషాలను తెలియజేస్తూ ఓ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. అక్కడ కొంత టాకీతోపాటు యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్టు ఈ వీడియో చూస్తే తెలుస్తున్నది. బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరుబాబీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రెస్టేజియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో చిరంజీవి పాత్ర రెండు విభిన్నకోణాల్లో సాగుతుందని ఇన్‌సైడ్ టాక్. చిరంజీవి కూతురుగా అనస్వర రాజన్ నటిస్తున్న ఈ సినిమాలో నివేద పేతురాజ్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్నది. హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలు ప్రకటించాల్సివుంది. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్, సంగీతం: తమన్.

# 112వ చిత్రానికి ముహూర్తం ఖరారు



అగ్ర కథానాయకుడు బాలకృష్ణ వరుసగా సినిమాల్ని పట్టాలెక్కిస్తున్నారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 111వ సినిమా చిత్రీకరణ ఇటీవలే మొదలైంది. ముంబయి నేపథ్యంలో సాగే ఈ కథలో బాలకృష్ణ శక్తివంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించబోతున్నారు. ఇదిలావుండగా బాలకృష్ణ 112 చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సంచలన కాంబినేషన్‌పై ఇప్పటికే భారీ హైప్ క్రియేట్ అయింది. ఈ సినిమాను ఎస్‌ఎల్‌వీ సినిమాస్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని నిర్మించబోతున్నారు. ఈ చిత్రాన్ని ఈ నెల 25న ఏపీ రాజధాని అమరావతి సమీపంలోని వెంకటాయపాలెం టీటీడీ ఆలయంలో ఘనంగా ప్రారంభించబోతున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో ప్రకటించనున్నారు.

# మైత్రి మూవీస్ నుంచి మరో క్రేజీ మూవీ..



యూత్‌ఫుల్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన 'రాజా ది రాజా' చిత్రం మూవీ లవర్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కె. శ్రీలతా రెడ్డి సమర్పిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం ఈ సినిమాను జూలై 17న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ముందుకు రావడం విశేషం. దీంతో సినిమా మరింత గ్రాండ్ గా ప్రేక్షకులను చేరుకునే అవకాశం లభించనుంది.
రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరో, హీరోయిన్‌ల మధ్య కెమిస్ట్రీతో పాటు వారి సరదా ప్రయాణాన్ని హైలైట్ చేశారు. కలర్ ఫుల్ విజువల్స్, ఆకట్టుకునే డిజైన్ చిత్రంలోని రొమాంటిక్ మూడ్‌ను ప్రజెంట్ చేస్తోంది. రుత్విక్, విశాఖ ధీమన్ ఉత్సాహంగా, ఎనర్జీతో కనిపిస్తున్నారు. వీరిద్దరి కెమిస్ట్రీ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా మారింది. ఈ చిత్రానికి మార్క్ కె రాబిన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. రవికిరణ్ బోయిడపు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విజయ్ కుమార్ పసుపులేటి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రంలో సాయికుమార్, డాక్టర్ నరేష్ విజయకృష్ణ, అవసరాల శ్రీనివాస్, విష్ణు ఓయి, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, బద్రం, మైమ్ మధు, ఆనంద్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వంటి ప్రముఖ పంపిణీ సంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేయడం ట్రేడ్ వర్గాల్లో సినిమాపై పెరుగుతున్న నమ్మకాన్ని సూచిస్తోంది. విడుదల తేదీ ఖరారవడంతో పాటు ప్రమోషన్స్ కూడా వేగం పుంజుకున్నాయి. చిత్ర బృందం ప్రచారం ముమ్మరం చేయడానికి సిద్ధంగా ఉంది. 'రాజా ది రాజా' యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే రిఫ్రెషింగ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులని అలరించనుంది.



# అతనికే అప్పగించండి!

సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే తారల్లో శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీకపూర్ ముందు వరుసలో ఉంటుంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ముద్దుగుమ్మ పెట్టిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పింక్ కలర్ నైట్ సూట్‌లో ఉన్న ఓ ఫొటోని ఇన్‌స్టాలో పోస్ట్ చేసి, దాని కింద.. 'ఒకవేళ నేను తప్పిపోతే.. దయచేసి శిఖర్ పహారియాకు నన్ను అప్పగించండి' అంటూ ఓ చమత్కారమైన సందేశాన్ని పొందుపరిచింది జాన్వీ. ప్రస్తుతం ఈ పోస్ట్‌పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. 'ఎంతో ముద్దుగా ఉంది' అంటూ ఒకరు కామెంట్ చేస్తే, 'రిలేషన్‌షిప్ గోల్స్' అంటూ మరొకరు అభినందించారు. జాన్వీ, శిఖర్ పహారియా గత కొంతకాలంగా రిలేషన్‌లో ఉన్న విషయం విదితమే. అయితే, ఈ బంధాన్ని అధికారికంగా మాత్రం వారు ధృవీకరించలేదు. గతంలో 'శిఖర్' అనే పేరున్న నెక్లెస్‌ని జాన్వీ ధరించి కనిపించడం, శిఖర్ కూడా జాన్వీ నటించిన సినిమాలను సోషల్ మీడియా వేదికగా ప్రశంసించడం, వీటితోపాటు గత ఏడాది జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జాన్వీతో కలిసి శిఖర్ కూడా సందడి చేయడం.. ఇవన్నీ వీరి రిలేషన్ రూమర్స్‌కి బలాన్ని చేకూర్చాయి. జాన్వీ రీసెంట్ పోస్ట్‌తో అది రూఢీ అయ్యింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**